7వ పాఠం ఆగష్టు 8-14

# దేవుని వాక్యమును పంచుకొనుట

సబ్బాతు మధ్యాహ్నము ఆగష్టు 8

**ఈ వారమునకు చదువ వలసిన వచనములు : కీర్తన 119:105; యిర్మీయా 23:29; హెబ్రీ 1:1-3; 2తిమోతి 3:14-17; 1యోహాను 1:7-9; ప్రసంగి 3:1,2; 2తిమోతి 4:2.**

**కంఠతవచనం: "ఆలాగే నా నోట నుండి వచ్చు వచనమును ఉండును. నిష్ఫలముగా నా యొద్దకు మరలక అది నాకు అనుకూలమైన దాని నెరవేర్చును. నేను పంపిన కార్యమును సఫలము చేయును" (యెష 55:11).**

మనము సాక్ష్యమిచ్చేటప్పుడు మనము క్రీస్తును గురించి మాట్లాడుదుము. అయితే బైబిలు లేకుండా క్రీస్తును గురించి మనకేమి తెలుసు? నిజానికి మనకు పరిశుద్ధ లేఖనములు లేనియెడల, మహా సంఘర్షణ గురించి, దేవుని ప్రేమను గురించి, యేసు యొక్క జననము గురించి, ఆయన జీవితమును గురించి, ఆయన సువార్త పరిచర్యను గురించి, ఆయన మరణమును గురించి, ఆయన పునరుత్తానమును గురించి, మరియు ఆయన యొక్క రెండవ రాకడను గురించి మనకు ఎంతవరకు తెలుసు?

దేవుని యొక్క శక్తిని మరియు ప్రభావమును ప్రకృతి బహిరంగ పరచినను అది రక్షణ ప్రణాళికను ప్రకటించుటలేదు. పరిశుద్ధాత్మ వ్యక్తి ద్వారా యేసు అనే "నిజమైన వెలుగు ఉండెను. అది లోకములోనికి వచ్చుచు ప్రతి మనుష్యుని వెలిగించుచున్నది" (యోహాను 1:9). అయినప్పటికి దేవుని వాక్యము లేకుండా దైవ సంబంధమైన సత్యమును, సంపూర్ణముగా వివరించుటకు మన హృదయాలకు పరిశుద్ధాత్మ వెల్లడిపరచిన విషయాలు పరిమితముగానే ఉన్నవి. లిఖించబడిన దేవుని వాక్యము స్పష్టముగాను మరియు సంపూర్ణముగాను, సజీవమైన వాక్యమైన యేసును గురించి ప్రకటించుచున్నది.

మత నాయకులు దేవుని వాక్యమును అధ్యయనము చేసినను అనేకమంది దాని ప్రాథమిక వర్తమానము యొక్క గురిని తప్పారు. "లేఖనములయందు మీకు నిత్య జీవము కలదని తలంచుచు వాటిని పరిశోధించుచున్నారు. అవే నన్ను గూర్చి సాక్ష్యమిచ్చుచున్నవి" (యోహాను 5:39) అని యేసు చెప్పెను. సరియైన రీతిలో గ్రహించిన యెడల బైబిలులో బోధించుచున్న ప్రతి విషయము దేవుని వాక్యమును పంచుకొనేటప్పుడు మనము సత్యము వైపు ఉన్నామనియు ఇతరులు అసత్యము చెప్పుచున్నారని నిరూపించడమనునది మన ప్రాథమిక గురి కాదు గాని యేసును గూర్చిన సత్యములోని ప్రతి కోణమును బహిరంగము చేయుటయే మన విధియైయున్నది.

-ఆగష్టు 15, సబ్బాతుదినమున ఈ వారము పాఠమును అధ్యయనము చేయుటకు ఈ వారమంతయు చదువుడి.

ఆదివారం ఆగష్టు 9

## దేవుని వాక్యము యొక్క చిహ్నములు

**కీర్తన 119:105; యిర్మీయా 23:29; లూకా 8:11; మత్తయి 4:4 చదువుడి. ఈ వాక్యాలలో "దేవుని వాక్యమును" వివరించుటకు వాడబడిన 5 చిహ్నములు ఏమిటి? దేవుని వాక్యమును సూచించుటకు ఈ 5 చిహ్నములను ఎందుకు ఎంపిక చేసియుంటారని మీరనుకొనుచున్నారు?**

-------------------------------------------------

-------------------------------------------------

ఈ వాక్యాలలో చూపించబడిన వివిధ చిహ్నములు దేవుని వాక్యము యొక్క ప్రాథమిక విధులను గూర్చి వివరించుచున్నవి. ఇతరులతో మనము పరిశుద్ధ లేఖనములను పంచుకొనేటప్పుడు అది జీవమును ప్రకాశింపజేసే వెలుగైయున్నదని చెప్పుచున్నాము. యేసు "లోకమునకు వెలుగైయున్నాడు" అని ప్రకటించేటపుడు దేవుని గూర్చి మరియు ఆయన స్వభావము గూర్చి వారికున్న తప్పుడు అభిప్రాయములోని చీకటిని తొలగిస్తున్నామని అర్థము. దేవుని విషయాలకు సంబంధించి మనస్సులలో ఏర్పడిన తప్పుడు భావములనే చీకటిని దేవుని వాక్యము ద్వారా పరిశుద్ధాత్మ తొలగించి ఆ మనస్సులను వాక్యముతో వెలిగింపజేయుచున్నాడు.

యిర్మీయా ప్రకారము మనము చూచినట్లయితే దేవుని వాక్యము ఒక అగ్ని మరియు సుత్తి వంటిదైయున్నది. అది మన జీవితములలో ఉన్న పాపము యొక్క మలినమును దహించివేయును. మన కఠిన హృదయములను బ్రద్దలు చేయు యేసు యొక్క మహిమను పరిశుద్ధ లేఖనములలో ప్రజలు చూచునట్లు మనము వారికి సహాయపడినప్పుడు వారి కఠిన హృదయాలు బ్రద్దలై ఆయన ప్రేమ యొక్క అగ్ని వారి జీవితాలలో ఉన్న స్వార్థము, దురాశ వాంఛ మరియు గర్వముతో కూడిన ఆత్మాభిమానము వంటి పాపపు మలినములను దహించివేయును.

దేవుని వాక్యము ఒక విత్తనము వంటిది. విత్తనమునకు జీవమును అనుగ్రహించే ప్రధానమైన లక్షణము ఉంటుంది. ఎదగటానికి విత్తనము కొంత సమయమును తీసుకుంటుంది. ఒకే సమయములో అన్ని విత్తనాలు మొలకెత్తవు అన్ని చెట్లు లేక మొక్కలు ఒకే పరిమాణములో పెరగవు. అయితే సరియైన పరిస్థితులలో నేలలో ఉన్న విత్తనమును పగుల కొట్టుకొని దానిలో ఉన్న జీవము మొలకెత్తును. అదొక నూతన మొక్కగా జీవించుట ప్రారంభిస్తుంది. ఇతరుల హృదయాలలోను, మనస్సులలోను దేవుని వాక్యాన్ని మనము నాటినప్పుడు మనము వెనువెంటనే దాని ఫలితములను చూడలేము కాని నిశబ్దముగా ఆ విత్తనము పెరుగుతుంది. మరియు దేవుడు నిర్దేశించిన కాలమును బట్టి వారు పరిశుద్ధాత్మ యొక్క పిలుపునకు స్పందించిన యెడల అది దేవుని రాజ్యము కొరకు ఒక పంటను ఉత్పత్తి చేయును.

యేసు తన వాక్యమును పోషణ యిచ్చే రొట్టె వంటిదని పోల్చి చెప్పెను. సంతృప్తినిచ్చే మంచి ఆహారములలో రొట్టె ఒకటి. ఒకని ఆత్మయొక్క ఆకలికి దేవుని వాక్యము సంతృప్తినిస్తుంది. మరియు అంతర్లీనముగా వున్న ఆధ్యాత్మిక విషయాలకు పోషణ అందిస్తుంది. దేవుని వాక్యమును గూర్చి ఉన్న వాగ్దానములను ఇతరులతో పంచుకొని ఆ జీవపు మాట యేసే అని వారు కనుగొనినప్పుడు వారి జీవితములు ఆయన మంచితనమును బట్టి మార్పు చెందును. ఆయన ప్రేమ ద్వారా ఆకర్షితులవుతారు. ఆయన కృపను బట్టి ఆశ్చర్యము చెందినవారై ఆయన సన్నిధిలో సంతృప్తిని పొందుదురు.

బైబిలు నుండి మాత్రమే మనకు తెలిసిన సత్యములను గూర్చి మరొకసారి ఆలోచించండి. అది మనకు బోధించే విషయాలను మాత్రము జాగ్రత్తగా భద్రపర్చుకోవాలని ఇది మనకేమి చెప్పుచున్నది?

సోమవారం ఆగష్టు 10

## సృజనాత్మక శక్తి కలిగిన దేవుని వాక్యము

**హెబ్రి 1:1-3, 4:12 మరియు కీర్తన 33:6,9 పోల్చి చూడుడి. సృజనాత్మక శక్తి కలిగిన దేవుని వాక్యమును గూర్చి ఈ వాక్యాలు ఏమి చెప్పుచున్నవి?**

--------------------------------------------

--------------------------------------------

దేవుని వాక్యము సజీవమైనది. ఆ వాక్యము ప్రకటించే విషయాలన్నియు అది నెరవేర్చగల సామర్థ్యము దానికున్నది. మానవులు సంభవించిన వాటి విషయములను ఉన్న వాటి విషయములను గూర్చి మాట్లాడగలరు. అయితే దేవుడు ఇంతవరకు జరగని విషయాలను గూర్చి మాట్లాడును. వాటిని తన మాటకున్న శక్తితో సృష్టిస్తాడు. దేవుని వాక్యము సృజనాత్మక శక్తి కలిగిన వాక్యము. తన నోటి నుండి వెలువడే మాట వినబడుతుంది. అది ప్రకటించే ప్రతి విషయాన్ని సృష్టించగలిగే శక్తి కలిగియుంటుంది.

ఆదికాండము 1లో ఉన్న సృష్టి వృత్తాంతములో "దేవుడు పలుకగా" అనే మాట అనేకమార్లు ఉపయోగించబడినది (ఆది కా. 1:3,6,11, 14, 20, 24, 26,29) దేవుడు ఒక ప్రకటనగా పలికిన మాటలలో శక్తి ఉన్నది. అందుచేత "ఆయన మాట్లాడగా ఆరిన నేల ఏర్పడి అది కనబడెను. మొక్కలు మొలకెత్తినవి, పువ్వులు వికసించినవి. పండ్లనిచ్చే చెట్లు అభివృద్ధి చెందినవి. జంతువులు ఉనికిలోనికి" వచ్చినవి.

ఆదికాండము 1లో దేవుని యొక్క సృజనాత్మక చర్యను గూర్చి వివరించుటకు హెబ్రీ భాషలో "బారా" అనే ఒక ఆసక్తికరమైన మాట వాడబడినది. ప్రత్యేకించి శూన్యము నుండి దేవుడు తన సృజనాత్మ శక్తిని ఉపయోగించి ఏదో ఒక దానిని ఆయన సృజించెను. దేవుడు కర్తగా ఉన్నాడని వివరించేటప్పుడు మాత్రమే ఆ క్రియాపదము వాడబడెను. అనగా దేవుడొక్కడే శూన్యములోనుండి దేనినైనను సృజించగలడనియు మరియు

ఆవిధముగా సృజించే క్రియను తన నోటితో పలికిన మాటకున్న శక్తి ద్వారా వివరించెననే భావము కలుగజేయుచున్నది.

దేవుడు తన మాటకున్న శక్తి ద్వారా ఈ లోకమును సృష్టించుటయే గాక తన మాటతోనే దానిని భరించుచున్నాడు. పోషిస్తున్నాడు మరియు పైకెత్తి పట్టుకొనియున్నాడు. దేవుడు తాను పలలికిన మాటలో ఉన్న శక్తి లిఖిత పూర్వకముగా ఉన్న ఆయన మాటలో కూడా అదే శక్తి ఉన్నది. సృష్టి సమయములో చురుకుగా ఉన్న పరిశుద్ధాత్మ, అంతే చురుకుగా లేఖనములను వ్రాయుటకు ఆత్మావేశమును కలుగజేసెను. మనము బైబిలు చదివేటప్పుడు, దానిని ఇతరులతో పంచుకొనేటప్పుడు పరిశుద్ధాత్మ మనతోనే ఉంటాడు, దేవుని వాక్యములో జీవమును అనుగ్రహించే, జీవమును మార్చగలిగే సృజనాత్మక శక్తి ఉన్నది. విశ్వములోని లోకములను ఉనికిలోనికి రమ్మని పిలిచిన సృజనాత్మక శక్తి కలిగినది దేవుని వాక్యము. ఈ వాక్యము శక్తిని అనుగ్రహిస్తుంది. ఇది జీవమును కలుగజేయును. ప్రతి ఆజ్ఞ ఒక వాగ్దానమైయున్నది. దానిని చిత్తము ద్వారా అంగీకరించి, ఆత్మలోనికి స్వీకరించినపుడు దానితో పాటు అనంతమైన దాని జీవమును అది వెంట బెట్టుకొని వచ్చును. అది ప్రకృతిని మార్చుచేస్తుంది. దేవుని స్వరూపములోనికి ఆత్మను తిరిగి సృజింపచేస్తుంది" -ఎలెన్ జి వైట్, విద్య , పుట 126.

దేవుని వాక్యములో ఉన్న వాగ్దానాలను మనము గట్టిగా పట్టుకున్నపుడు వాటి ద్వారా మన జీవితాలు మార్పు చెందును. ఆశ్చర్యకరమైన ఈ వాగ్దానాలను ఇతరులు అందిపుచ్చుకొనే విధంగా వారికి సహాయపడితే వారి జీవితాలను కూడా పరిశుద్ధాత్మ మార్చివేయును.

**దేవుడు మాట పలుకగా "అవి ఉనికిలోనికి వచ్చెను. దీనిని గూర్చి ఊహించండి. దీని భావము ఏమైయుంటుందో ఏవిధంగా అర్ధము చేసుకొనగలము? దేవుని యొక్క సృజనాత్మక శక్తికి సంబంధించిన ఆశ్చర్యకరమైన ఈ యదార్ధము మనకేమి చెపుతుంది? దేవునికున్న సృజనాత్మక శక్తి యదార్ధమైనదనే విషయము మనకెందుకు ఆదరణ కలిగిస్తుంది?**

మంగళవారం ఆగష్టు 11

## దేవుని వాక్యమును చదువుట వలన కలిగే మేలులు

దేవుని వాక్యము చదువుట వలన అనేక మేలులు సంభవిస్తాయి. అపొస్తలుడైన పేతురు ఈ విధముగా చెప్పుచున్నాడు. పరిశుద్ధ లేఖనముల యొక్క వాగ్దానముల ద్వారా మనము "దైవ స్వభావములో పాలివారమగుదుము" (2పేతురు 1:4). యాకోబు మాట్లాడుతూ "లోపల నాటబడి మీ ఆత్మలను రక్షించుటకు శక్తిగల వాక్యము" (యాకోబు 1:21) అనియు, పౌలు మరికొన్ని విషయాలు చెప్పుచు "ఇప్పుడు దేవునికి ఆయన కృపా వాక్యమునకును మిమ్మును అప్పగించుచున్నాను. మీకు క్షేమాభివృద్ధి కలుగజేయుటకును, పరిశుద్ధ పరచబడిన వారందరిలో స్వాస్థ్యమనుగ్రహించుటకు శక్తిమంతుడు" (అపొ॥కార్య 20:32) అని

వివరించెను. బైబిలు విమోచన గురిని కలిగియున్నది. లేఖనములందంతట యేసును చూచుట ద్వారా మనము మార్పు చెందితిమి. ఆయన వాక్యములో ఆయనను చూచుట ద్వారా ఆయన పోలికగానే మార్చబడుచున్నాము" (2కొరింథి 3:18) ఆయనను చూచుట ద్వారా ఆత్మీయ స్వభావమునందు, భావమునందు ఆయనవలె మార్పు చెందుదుము. ఏవిషయాల మీద మనస్సు కేంద్రీకరిస్తామో క్రమేణా వాటిని మనస్సు రూపాంతరించుకుంటుంది" –ఎలెన్ జి వైట్, మహా గొప్ప సంఘర్షణ, పుట 555.

**2 తిమో 3:14–17; యోహాను 17:14–17 చదువుడి. దేవుని వాక్యమును చదువుట వలన అదనముగ వచ్చే ప్రయోజనమేమిటి?**

---------------------------------------------

---------------------------------------------

పౌలు తన సహచరుడైన యౌవనస్తుడు తిమోతికి ఉత్తరము వ్రాస్తూ, వాక్యమునకు విధేయత చూపించాలని వాక్యమును చదువుట వలన కలిగే మేళ్ళను గూర్చి పంచుకొనుచున్నాడు. పౌలు ప్రకారము బైబిలు ఉపదేశించుటకు నీతియందు శిక్ష చేయుటకును అది సత్యమును బయలుపర్చి తప్పును దిద్దుటకు మానవజాతికి దేవుని యొక్క ప్రణాళికను వివరించుచు ఉపయోగపడును. బైబిలు క్రీస్తు యొక్క నీతిని బయలుపర్చును. మన పాపపు స్వభావము వలన కలుగు అజ్ఞానమునుండి యేసు యొక్క నీతి యొక్క సౌందర్యములోనికి అది మనలను నడిపించును. స్వార్ధపరులమైన మనము ఒక్కసారి నిస్వార్ధమైన ఆయన ప్రేమ యొక్క లోతును లేఖనములో మనము చూచినప్పుడు మన జీవితములు మార్పు చెందును. ఇతరులతో దేవుని వాక్యమును పంచుకున్నపుడు వారు కూడా వారి ఆలోచనలోను, జీవిత విధానములోను సమూలముగా మార్పు చెందుదురు. యేసును తన వాక్యములో చూచినపుడు ఆయనవలె ఎక్కువ మార్పు చెందుదుము. మనమేమిఆలోచిస్తున్నామో వాటిని గూర్చి చెప్పుట లేక మనము దేనిని నమ్ముచున్నామో వాటిని గూర్చి చెప్పుట సాక్ష్యమనబడదు. దేవుని వాక్యములో ఉన్న నిత్య సత్యములను గూర్చి ఇతరులతో పంచుకొనవలసియున్నాము. దేవుని వాక్యము నమ్మరానంతగా మన జీవితములను ఆశీర్వదించినపుడు ఇతరులకు కూడా అది ఎంత ఆశీర్వాదకరముగా ఉంటుందో వారికి చెప్పుటకు మనకు విశ్వసనీయత ఉంటుంది.

**నీవు వ్యక్తిగతముగా ఎదుర్కొనిన కష్ట సమయాలను గూర్చి ఆలోచించుడి. అటువంటి సమయములో దేవుని వాక్యము నీకు బలమును చేకూర్చిన విషయాన్ని జ్ఞాపకము చేసుకో. అట్టి అనుభవమునుండి ఏమి నేర్చుకున్నారు?**

బుధవారం ఆగష్టు 12

## దేవుని వాక్యమును అన్వయించుకొనుట

దేవుని వాక్యములో మూడు వేల వాగ్దానములకన్నా ఎక్కువే ఉన్నట్లు ఎవరో ఒకరు లెక్కించారు. వీటిలోని ప్రతి వాగ్దానము ప్రేమామయుడైన దేవుని హృదయములోనుండి

వచ్చుచున్నది. "కార్యసాధకమైన తన శక్తి చొప్పున మనము అడుగు వాటికంటెను, ఊహించు వాటికంటెను అత్యధికముగా దేవుడు మనకు చేయుచున్నాడు" (ఎఫెసి 3:20). ఒక నిబద్ధతతో మనము ప్రతి వారికి దేవుడు తన వాగ్దానములను చేసియున్నాడు. అవి మన యెడల నెరవేర్చబడుటకే చేయబడిన వాగ్దానములు. విశ్వాసముతో కూడిన ఈ వాగ్దానములను మనము పొందాలని కోరుకున్నపుడు అదే విషయాన్ని ఇతరులకు బోధించిన యెడల మనందరి జీవితాలలోనికి ఆ దీవెనలు పరలోకమునుండి ప్రవహించును. ఈ దైవ సంబంధమైన సత్యమును అపొస్తలుడైన పౌలు రోమా 8లో వివరించాడు. "తన సొంత కుమారుని అనుగ్రహించుటకు వెనుతీయక మనందరి కొరకు ఆయనను అప్పగించిన వాడు ఆయనతో పాటు సమస్తమును మనకెందుకు అనుగ్రహించడు?" (రోమా 8:32). ఈ వాగ్దానమును అపొస్తలుడైన పేతురు వివరిస్తూ "ఆయన దైవ శక్తి జీవమునకును, భక్తికిని కావలసిన వాటన్నిటిని దయ చేయుచున్నాడు (2పేతురు 1:3). సిలువ మీద క్రీస్తు మరణము ద్వారా ఆయన సాతాను పైన, ఈ లోక శక్తులపైన, అంధకార శక్తులపైన సాధించిన విజయము ద్వారా, దైవ సంబంధమైన మరియు మన ఆధ్యాత్మిక జీవితానికి అవసరమైన సమస్తమును ఆయన అనుగ్రహించెను. ఆయన మన ప్రాథమిక భౌతిక అవసరాలకు సంబంధించిన విషయాలను కూడా అనుగ్రహిస్తానని వాగ్దానము చేసెను.

**1యోహాను 1:7-9; ఫిలిప్పి 4:13, 19 పోల్చి చూడుడి. ఈ వాగ్దానములు వేరే విధముగా ఉన్నను; దేవుని స్వభావమును గూర్చి మనకేమి బోధిస్తున్నవి? మన జీవితాలను ఈ వాగ్దానాలు ఏవిధముగా ప్రభావితము చేసినవి?**

---------------------------------------------

---------------------------------------------

ఈ పై వాక్యాలలో మనము చదివిన ప్రతి వాగ్దానము ఏదో ఒక ప్రత్యేకమైన విషయమును గూర్చి మాట్లాడుచున్నవి. అయితే దేవుని గూర్చి వివరించే దృశ్యము మాత్రము మనకు ఒక విధముగా కనిపించేటట్లు ఇవ్వబడెను. ప్రేమతో క్షమించేవాడు. అనంతమైన శక్తిగలవాడు. మన ప్రాథమిక అవసరాలను తీర్చగలిగే ఒక దేవుని అవి బయలుపర్చుచున్నవి. దేవుడు మనయెడల ఎంతో తీవ్రమైన ప్రేమతో మనలను సంరక్షించుటకు వాగ్దానము చేయుచున్నట్లు ఆ వాక్యాలు మనకు వివరిస్తున్నవి.

**హెబ్రి 3:19; 4:1-3 మరియు మత్తయి 13:58 చదువుడి. విశ్వాసము యొక్క అవసరమును గూర్చి ఈ వాక్యాలు మనకేమి చెప్పుచున్నవి?**

బైబిలులో దేవుని యొక్క ఆశ్చర్యకరమైన అనేక వాగ్దానములున్నవి. దేవుని వాక్యము చేసిన వాగ్దానములను బట్టి మనము వాటిని పొందాలని కోరుకున్నప్పుడు క్రీస్తు వాటిని వాగ్దానము చేసాడని నమ్మినపుడు ఆ వాగ్దానముల వలన కలిగే దీవెనలు పొందగలుగుదుము. దేవుని యొక్క సామర్థ్యము పై విశ్వాసము లేనపుడు మన జీవితమును గూర్చి ఆయన

వాక్యములో చేసిన వాగ్దానాలు నెరవేరకపోవచ్చును. దేవుని వాగ్దానములో పేర్కొనబడిన వాగ్దానములు ఎవరికైతే అవసరముంటాయో అవి వారి యెడల నెరవేరునట్లు ప్రార్ధనా పూర్వకముగా వారు దేవుని యొద్దకు విన్నపములతో చేరునట్లు ఈ వారము మీ తరగతిలో ప్రోత్సహించుము.

**గురువారం** **ఆగష్టు 13**

## దేవుని వాక్యమును పంచుకొనుట

శుభవార్తను ఇతరులతో పంచుకొనవలసియున్నది. నీ జీవితములో కొన్ని శుభవార్తలను వినినప్పుడు నీవు మెండుగా సంతోషించిన సమయములను గూర్చి ఆలోచించుము. అది వివాహమునకు ముందుగా జరిగే నిశ్చితార్ధ సమయమైనా కావచ్చును. ఒక బిడ్డ జన్మించిన దినమైన కావచ్చును. ఒక నూతన ఉద్యోగము దొరికిన దినమైనను కావచ్చును. లేక ఒక నూతన గృహమును గాని లేక కారును గాని కొన్న దినమైనను కావచ్చును. మీరు ఎంతగానో ఆ విషయమై ఉత్తేజము చెందుట వలన ఆ విషయాన్ని వెంటనే ఇతరులతో పంచుకొనకుండా ఉండలేకపోవుదురు.

మనము పొందే ఆనందమును ఇతరులతో పంచుకొనడము చాలా అద్భుతమనిపిస్తుంది. అయితే యేసును గూర్చిన వృత్తాంతము ఈ విశ్వమంతటికి శుభ సందేశమైయున్నది. క్రీస్తునందు మనకు రక్షణ ఉందనే విషయమును గూర్చి ఆయన వాక్యములో నూతన భావమును మనము కనుగొన్నట్లయితే మన హృదయములు ఆనందముతో పొంగి పొర్లిపోతాయి. మరియు ఎవరో ఒకరికి ఆ విషయాన్ని చెప్పాలని ఎదురు చూస్తుంటాము. మత నాయకులు అపొస్తలులను సువార్తను బోధించకూడదని వారిని ఆపి వేయుటకు ప్రయత్నించినపుడు పేతురు "మేము కన్న వాటిని, విన్న వాటిని చెప్పకయుండలేమని" వారికి చెప్పెను (అపొ॥కార్య 4:20).

యేసునందు ఒక అమూల్యమైన స్నేహితుని నేను కనుగొంటిని అని ఇతరులకు తెలియపర్చాలనే కోరిక తన హృదయములో పుట్టిన ఒకడు క్రీస్తు నొద్దకు వచ్చెను. అతడు యేసునందు కనుగొనిన రక్షణ మరియు పవిత్రపర్చే సత్యము తన హృదయములో దాచిపెట్టుకొని యుండలేక పోయెను. మన క్రీస్తు యొక్క నీతి వస్త్రమును ధరించుకొనిన వారమై మరియు ఆత్మతో నింపబడిన ఆనందములో ఉన్నప్పుడు, నెమ్మదిగా ఉండలేము" –ఎలెన్ జి వైట్, క్రీస్తు యొక్క మెట్లు, పుట 78.

రోమా 1:14–16లో పౌలు ఈవిధముగా వ్రాస్తున్నాడు. "గ్రీసు దేశస్థులకును గ్రీసు దేశస్థులు కాని వారికిని, జ్ఞానులకు, మూఢులకును నేను ఋణస్థుడను. కాగా నా వలననైనంత మట్టుకు రోమాలోని మీకును సువార్త ప్రకటించుటకు సిద్దముగా ఉన్నాను. సువార్తను గూర్చి నేను సిగ్గుపడువాడను కాను. ఏలయనగా నమ్ము ప్రతివానికి, మొదట యూదునికి,

గ్రీసు దేశస్థునికి కూడ రక్షణ కలుగజేయుటకు అది దేవుని శక్తియైయున్నది" (రోమా 1:14-16).

పౌలు తాను ఏవిధముగా మారు మనసు పొందాడో అనే విషయాన్ని చెప్పుటకు ఎన్నడూ విసుగు చెందలేదు. యేసునందు తన హృదయము ఆనందముతో నిండి పొర్లిపారుచుండెను. పౌలు విషయములో శుభవర్తమానము అంటే అది ఇతరులతో పంచుకొనేదై యున్నదని ఆయన భావించాడు. అందుచేత ఆయన ఎన్నడూ నెమ్మదిగా ఉండలేకపోయాడు.

**దేవుని వాక్యమును ఇతరులతో పంచుకొనే విషయములో ఈ క్రింది వాక్యాలు ఏ ప్రధానమైన నియమాలను మనకు సూచిస్తున్నవి? యెషయా 50:4; ప్రసంగి 3:1; 2తిమోతి 4:2.**

-------------------------------------------

-------------------------------------------

క్రీస్తు మరియు ఆయన సేవ కొరకు మనలను సమర్పించుకొనుట వలన తగిన సమయములో దేవుని వాక్యమును గూర్చి మాట్లాడుటకు అవకాశములనే ద్వారములను ఆయన తెరచిఉంచును. ప్రతీసారి ఇచ్చే సాక్ష్యములో మూడు విషయాలను మనసులో పెట్టుకోవాలి; మనము ఏమి చెప్పుచున్నాము, ఏవిధముగా చెప్పుచున్నాము మరియు ఎప్పుడు దానిని గూర్చి చెప్పుకున్నాము.

**నీవు ఎవరికి సాక్ష్యమివ్వాలనుకొనుచున్నావు? వారికి నీవు ఒక మంచి సాక్ష్యమిచ్చే వానిగా ఏవిధముగా ఉండగలవు?**

**శుక్రవారం** **ఆగష్టు 14**

## అదనపు అధ్యయనము

ఎలెన్ జి వైట్ రచించిన "క్రీస్తు యొద్దకు మెట్లు" నుండి దేవుని గూర్చిన జ్ఞానము, పుటలు 87-91; సువార్త సేవకులు నుండి "కుటుంబముతో కలిసి బైబిలు పఠనము చేయుట" పుటలు 192, 193 మరియు సువార్త పరిచర్య నుండి "బైబిలు సేవా విధానము" పుటలు 481-489 చదువుడి.

మన చుట్టు ప్రక్కలున్న వారందరి హృదయాల మీద దేవుడు పని చేయుచున్నాడు. దేవుడెక్కడ పనిచేస్తున్నాడో చూచుటకు ఆత్మీయ పరిశీలన ఉంటే ఇతరులకు దేవుని వాక్యమనే విత్తనమును వెదజల్లుటకు మనకు అవకాశాలు కనిపిస్తాయి. నికొదేము హృదయమును, బావి యొద్ద స్త్రీ యొక్క హృదయమును, రక్తస్రావము గల స్త్రీ హృదయమును, సిలువ మీద వ్రేలాడుచున్న దొంగ హృదయమును, రోమా శతాధిపతి

యొక్క హృదయమును మరియు ఇతరులలోఅనేక మంది హృదయాలను యేసు యొక్క పని వారు కలుసుకొనకముందే దేవుని వాక్యమును స్వీకరించుటకు పరిశుద్ధాత్మ సిద్దము చేస్తాడు. వారు జీవించుచున్న పరిస్థితుల ప్రకారము, పరిశుద్ధాత్మ వారితో పనిచేయుట వలనను క్రీస్తు యొక్క వర్తమానమును స్వీకరించుటకు సిద్దము చేయబడి ఉంటారు.

మేము మీతో కలిసి ప్రార్థించవచ్చునో లేదా బైబిలు వాగ్దానమును పంచుకొనవచ్చునా లేక ఏదైన బైబిలుకు సంబంధించిన వర్తమానముతో కూడిన కరపత్రమును అందించవచ్చునా అని అడిగే సహజమైన లక్షణము మనలో యుండవచ్చును. ఎవరో ఒకరికి మన విశ్వాసమును పంచుకోవాలని పరిశుద్ధాత్మ మనలను ప్రేరేపించినట్లు వేరే వ్యక్తులను కూడా ప్రేరేపించుట వలన మన సాక్ష్యమును వారు స్వీకరించుటకు సిద్దముగా ఉంటారు.

## చర్చించుకొనుటకు ప్రశ్నలు

1. ఏదో ఒక విషయములో భయంకరమైన అపరాధ భావముతో ఎవరైనా మీ యొద్దకు వచ్చినచో వారికి దేవుని యొద్ద నుండి పాపక్షమాపణ అవసరమని వారు భావించినపుడు నీవెట్టి సలహాను ఇస్తావు? ఏ బైబిలు వాక్యాలు వారితో పంచుకుంటావు? అపరాధ భావమును గూర్చి నీ స్వకీయ అనుభవము ఏమిటి? మరియు నీ స్వకీయ జీవితములో నీకు అవసరమైన పాపక్షమాపణ అనుగ్రహించుటకు దేవునికున్న శక్తిని గూర్చి నీ అనుభవమేమిటి?
2. కొన్ని సందర్భాలలో కొంతమందికి దేవుని గూర్చిన సత్యమును తెలుసుకోవాలనే దృఢమైన కోరికలో ఉన్న వారిని దేవుడు నీయొద్దకు నడిపిస్తాడు. దేవుని నడుపుదల విషయమై మనము ఎంత సున్నితముగా వ్యవహరించవలసియున్నాము?
3. దేవుని యొక్క శక్తిని గురించి మరియు సృష్టి వృత్తాంతము మరియు సృష్టి ద్వారా బయలుపర్చబడిన దేవుని వాక్యమును గురించి ఆలోచించుడి. విశ్వమును గూర్చి మనము అర్ధము చేసుకొనుట లేక గ్రహించుట అనునది అంత సులభమైన విషయము కాదు. అది ఎంతో పెద్దది మరియు విశాలమైనది. విశ్వమంతటిని దేవుడు సృష్టించాడని తలంచినప్పుడు ఆ దేవుడు ఆయన సృష్టించిన దానికంటే ఎంతో పెద్దవాడై యుంటాడనియు మరియు ఎంతో శక్తిమంతుడైయుంటాడని మనము ఆలోచిస్తాము. మనము సేవించుచున్న దేవుడు మహాశక్తిమంతుడైయున్నాడని గ్రహించుట ద్వారా దాని నుండి ఏ విధముగా ఆదరణ పొందగలము? ఆయన బలమైన వాడే కాదు ఆయన ప్రేమాస్వరూపియై యున్నాడనే విషయమునుండి ఎటువంటి నిరీక్షణను పొందగలము? ఇటువంటి జ్ఞానమును కలిగియుండుట వలన అది ఇతరులకు సాక్ష్యమిచ్చుటకు ఏవిధముగా సహాయపడుతుంది?

❖❖❖